సాక్షి
ప్రకాశం

శనివారం । 22 । మార్చి । 2025



మీరు రైతులు కాదోయ్..
రాయితీ రాదోయ్

రైతు విశిష్ట గుర్తింపు కార్డు ప్రక్రియ జిల్లాలో రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

- 8లో..



అట్టహాసంగా ఎడ్లపోటీలు

వెలుగొండ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జాతీయ స్థాయి ఎడ్ల పందేలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.

- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
37/24

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

రంజాన్ వేళలు

శనివారం	ఇఫ్తార్
సాయంత్రం	గం 6 : 29
ఆదివారం	సహరీ
ఉదయం	గం 4 : 54

న్యూస్‌రీల్

ఏఎస్సై బాషాకు రాష్ట్ర పోలీసు, అగ్నిమాపక సేవా పతకం



షేక్ మహబూబ్‌బాషా

సింగరాయకొండ: రాష్ట్ర పోలీసు, అగ్నిమాపక సేవా పతకం ఉగాది–2025 కు ఏఎస్సై షేక్ మహబూబ్‌బాషా ఎంపికయ్యారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు ఆయనకు ఈ అవార్డు లభించింది. మహబూబ్ బాషా మాట్లాడుతూ తాను గతంలో కేంద్ర ప్రభుత్వ ఉత్కిష్ట సేవాపతకం, 70 నగదు అవార్డులు, 25 గుడ్ సర్వీస్ ఎంట్రీ, 5 ప్రశంస పత్రాలు అందుకున్నానని వివరించారు. తనకు అవార్డు రావడానికి సహకరించిన ఎస్పీ ఏఆర్ దామోదర్, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐ సీహెచ్ హజరత్తయ్య, ఎస్సై బీ మహేంద్రలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం



కవులు, రచయితలను సన్మానిస్తున్న కళా మిత్రమండలి, నరసం సభ్యులు

ఒంగోలు మెట్రో: నరసం, కళా మిత్రమండలి, తెలుగు లోగిలి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఒంగోలు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రపంచ కవితా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సభకు నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘం గౌరవ అధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్క కవి బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని రచనలు చేయాలన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా గ్రంథాలయం సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి మాట్లాడుతూ సామాజిక రుగ్మతలతో బాధపడుతున్న వారిని సరైన దిశకు మళ్లించి దిశా నిర్దేశం చేసేలా కవిత్వం ఉండాలన్నారు. నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ కవిత్వం, సాహిత్యం ఎప్పుడూ సమాజ శ్రేయస్సునే కోరుకుంటుందని, అందుకే తామంతా సాహిత్య మార్గాన్ని ఎంచుకున్నామని తెలిపారు. కళా మిత్ర మండలి సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమరావు సంచాలకత్వంలో కవి సమ్మేళనం నిర్వహించారు. పోతుల పెద వీరనారాయణ, కుర్రా ప్రసాద్ బాబు, ఓరుగంటి ప్రసాద్, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, మిడసల మల్లికార్జునరావు, బీరం అరుణ, బండారు సునీత, జి పద్మజ, యస్.నరసమ్మ, యు.వి.రత్నం, పిన్ని వెంకటేశ్వర్లు, నిమ్మల వెంకయ్య, గుండుపల్లి రాజేంద్రప్రసాద్, కేఎస్వీ ప్రసాద్, చుండూరి శ్రీనివాసరావు, హనుమంతరావు, అంగలకుర్తి ప్రసాద్, పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో మాతృమరణాల నివారణ

ఒంగోలు సిటీ: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే మాతృమరణాలు నివారించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వారి చాంబర్‌లో ఇటీవల సంభవించిన మాతృ మరణాలపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు ప్రమాద సంకేతాలున్న గర్భిణులు, అనీమియా, అధిక రక్తపోటు, మధుమేహం, ఎపిలెప్సీ, ప్రసవ పూర్వ రక్తస్రావంతో బాధపడుతున్న వారిని సకాలంలో గుర్తించి వారికి సరైన సమయంలో వైద్య సేవలు అందించటం ద్వారా మాతృమరణాలు నివారించవచ్చన్నారు. జిల్లా పరిధిలో మాతృ మరణాలు సంభవిస్తే అందుకు కారకులైన సిబ్బంది పై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ కర్త డాక్టర్ సూరిబాబు, ఐ.ఎం.ఎ, ఫోగ్సి ప్రతినిధులు డాక్టర్ జాలాది మణిబాబు, డాక్టర్ కమల, డాక్టర్ పి.పద్మజ, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారిని, డాక్టర్ అనంత కుమారి, డాక్టర్ చలపతి, డాక్టర్ శిరీష ప్రియదర్శిని, సుగుణమ్మ డీపీహెచ్ఎన్ఓ, డి.శ్రీనివాసులు, మాస్ మీడియాధికారి, అర్ధవీడు ప్రాథమిక ఆరోగ్య వైద్య అధికారి డాక్టర్ జవహర్ కుమార్ పాల్గొన్నారు.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

కల్తీ కుమ్మక్కు..
కేసుల గమ్మత్తు..!

పెట్రోలు తక్కువ కొడుతున్నారని వివాదం...

ఒంగోలు నగరంలోని అద్దంకి బస్టాండ్ సెంటర్లో ఉన్న ఒక పెట్రోలు బంకులో తక్కువ పెట్రోలు కొట్టి మోసం చేస్తున్నారని ఇటీవల ఒక వినియోగదారుడు గొడవ పెట్టుకున్నాడు. స్వయంగా వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టాడు. మొత్తం పెట్రోలు తీయించి లీటర్ బాటిల్తో కొలత వేయగా చాలా తక్కువ పెట్రోలు వచ్చింది. నగరంలోని మరో పెట్రోలు బంకులో కూడా ఇలాగే జరిగింది. పెట్రోలు నాణ్యత విషయంలో తరచుగా గొడవలు జరుగుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం ఉండటం లేదని వినియోగదారులు వాపోతున్నారు.



జిల్లాలో అన్నిరకాల వాహనాలు
3,76,493

జిల్లాలో పెట్రోల్ బంకులు **279**

రోజుకు పెట్రోల్ వినియోగం
3.6 లక్షల లీటర్లు

రోజుకు డీజిల్ వినియోగం
9.3 లక్షల లీటర్లు

- పెట్రోలు, డీజిల్ కొలతల్లో తేడాలు
- చోద్యం చూస్తున్న తూనికలు, కొలతల అధికారులు
- పెట్రోలు బంకుల నిర్వాహకులు, పెట్రోలు కంపెనీల అధికారులు కుమ్మక్కు
- నామమాత్రంగా కేసులతో సరిపెడుతున్న వైనం
- ఏడాదికి సరాసరిన 15 నుంచి 20 కేసులు మాత్రమే నమోదు
- చాలా బంకుల్లో కనిపించని బాట్లింగ్ పేపర్లు
- బంకుల్లో కానరాని సేవలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: పెట్రోలు బంకుల్లో మోసాలు నిత్యకృత్యంగా మారాయి. జిల్లాలో రోజూ ఏదో ఒక ప్రాంతంలో పెట్రోలు బంకుల్లో మోసాలపై ఘర్షణలు జరుగుతూనే ఉంటాయి. గతంలో ఒకరకమైతే...ప్రస్తుతం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాహనదారుల జేబులకు కన్నాలు వేస్తున్నారు. మన కళ్ల ముందే పెట్రోలు కొడుతున్నా కనురెప్ప వేసేలోపు మోసం జరిగిపోతూనే ఉంది. కొలతల్లో మోసాలు నిత్యకృత్యమయ్యాయి. పట్టించుకోవాల్సిన తూనికల, కొలతల శాఖ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఆయా కార్యాలయాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. వినియోగదారులను కంటికి రెప్పలా కాపాడాల్సిన ప్రభుత్వం సంబంధిత విభాగాలపై సీతకన్ను వేయటంతో సిబ్బంది లేక అధికారులు ప్రైవేటు లైసెన్స్‌దారులపై ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

ఇన్‌చార్జి అధికారే దిక్కు..

ఒంగోలులో తూనికల, కొలతల శాఖకు అసిస్టెంట్ కంట్రోలర్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయానికి రెగ్యులర్ అధికారి లేరు. నెల్లూరు జిల్లా అధికారిని ఇక్కడ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఒంగోలు, మార్కాపురం, పొదిలిలో ఇన్‌స్పెక్టర్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో కూడా సిబ్బంది కొరత తీవ్రంగా వెంటాడుతోంది. అందుకే ఉన్న అధికారులు, సిబ్బంది నామమాత్రంగా తనిఖీలు చేస్తుంటారు. పెట్రోల్ బంకుల్లో జరుగుతున్న మోసాలపై ‘సాక్షి’ బృందం జిల్లాలోని పలు బంకులను తనిఖీ చేసింది. ఈ పరిశీలనలో చాలా ప్రాంతాల్లో నిబంధనలు పాటించడంలేదని తేలింది. పెట్రోల్ కల్తీని తెలుసుకునేందుకు ప్రతి బంకులో ఉండాల్సిన బాట్లింగ్ పేపర్ ఉండడం లేదన్న విషయం బహిర్గతమైంది. బంకు తెరిచిన తర్వాత మిషన్లలో ఉన్న ఎయిర్‌ను తీసిన తర్వాతనే పెట్రోల్ కొట్టాల్సి ఉంది. కానీ చాలా ప్రాంతాల్లో ఇది అమలు కావడంలేదు. ఉదయాన్నే ఉరుకులు పరుగుల మీద బయటకు వెళ్లే సమయంలో బంకుల్లో పెట్రోల్ కొట్టించుకున్న వారు మోసపోతున్నారు. ఫలితంగా 40 శాతం ఎయిర్, 60 శాతం పెట్రోల్ మాత్రమే ఉంటోందన్న ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో నామమాత్రపు కేసులు...

జిల్లాలో అన్ని రకాల వాహనాలు కలుపుకొని 3,76,493 ఉన్నాయి. ప్రతి రోజు జిల్లాలో పెట్రోలు సరాసరిన 3.6 లక్షల లీటర్లు, డీజిల్ సరాసరి 9.30 లక్షల లీటర్లు వినియోగిస్తున్నారు. పెట్రోలు బంకుల్లో అక్రమాలు జరుగుతున్నా జిల్లాలో తూనికలు, కొలతల శాఖ అధికారులు నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 279 వివిధ కంపెనీలకు చెందిన పెట్రోలు బంకులు ఉన్నాయి. కేసులు నమోదు చేస్తున్న అధికారులు అపరాధ రుసుం వసూలు చేస్తున్నారు తప్ప మోసాలకు పాల్పడుతున్న బంకులపై తీవ్రమైన చర్యలు శూన్యం. అధికారులు సంబంధిత బంకు నిర్వాహకులు, కంపెనీ ప్రతినిధులతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

నమోదు చేసిన కేసుల వివరాలు

సంవత్సరం	నమోదైన కేసుల సంఖ్య	వసూలు చేసిన అపరాధ రుసుం
2023	17	రూ.3,75,000
2024	20	రూ.5,75,000
2025 (ఫిబ్రవరి వరకు)	15	రూ.4,55,000

పెట్రోలు బంకులు నిర్వహిస్తున్న కంపెనీలు:

ఐఓసీ	101
హెచ్‌పీసీఎల్	72
బీపీసీఎల్	64
ఎస్ఆర్	40
రిలయన్స్	01
షెల్	01

కానరాని సేవలు

పెట్రోల్ బంకులు కేవలం ఇంధనం అందించడానికి మాత్రమే కాకుండా, వినియోగదారులకు అనేక ముఖ్యమైన సేవలు అందించాలి. తాగునీరు, శుభ్రమైన మరుగుదొడ్లు, ప్రథమ చికిత్స, గాలి నింపు యంత్రం వంటివి అందుబాటులో ఉండాలి. అయితే చాలా బంకుల్లో ఇవేమీ కనిపించలేదు. ప్రధానంగా బంకుల యజమానులు వినియోగదారులకు ఎయిర్ మిషన్ ఏర్పాటు చేసి దాని ద్వారా వినియోగదారులకు ఉచితంగా ఎయిర్ అందించాల్సి ఉంటుంది. తాగనీరు, ఉచిత ఫోన్ సౌకర్యం, మరుగుదొడ్లు, ఫిర్యాదు బాక్స్, పెద్ద అక్షరాలతో ధరల పట్టిక, ఫైర్‌సేఫ్టీ డివైజర్స్, బిల్లు ఇవ్వడం, క్వాంటిటీ, క్వాలిటీ కోసం 5 లీటర్ల క్యాన్ ఇలా ప్రతిబంకులో వినియోగ దారులకు సౌకర్యాలు ఉండాలని నియమాలు ఉన్నాయి. ఈ నియమాలకు ఆయా యజమానులు వాటికి మంగళం పాడుతున్నారు. నామమాత్రంగానే కేవలం నాలుగైదు సౌకర్యాలు తప్ప అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న పెట్రోల్ బంకులు ఏఒక్కటీ లేవు.

అధికారుల పర్యవేక్షణ నిల్...

మార్కాపురం టౌన్: పట్టణ, పట్టణ శివార్లలో కలిపి మొత్తం 14 పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఇటీవల కాలంలో కళాశాల రోడ్డులోని ఓ పెట్రోల్ బంకులో కిరోసిన్ కల్తీ పెట్రోల్ విక్రయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల పెట్రోల్లో కల్తీ నిర్ధారించే డెన్సిటీ పేపర్ల (బాట్లింగ్)ను అందుబాటులో ఉంచడం లేదు. పెట్రోల్ పోయించుకున్నప్పుడు ఈ పేపర్‌తో చెక్ చేస్తే పెట్రోల్ కల్తీ జరిగిందా లేదా అన్న విషయం తెలుస్తుంది. మెజార్టీ బంకుల్లో ఇవి అందుబాటులో ఉంచడం లేదు. ఇటీవల కాలంలో అధికారులు తనిఖీలు నిర్వహించిన దాఖల్లాలేవు.

ఎయిర్ తీయటంలో అశ్రద్ధ

చీమకుర్తి: ప్రతి రోజు ఉదయాన్నే బంకుల్లో ఉన్న మిషన్లలో ఎయిర్‌ను తీసిన తర్వాతనే పెట్రోల్ కొట్టాల్సి ఉంది. అయితే చాలా ప్రాంతాల్లో ఎయిర్ తీయకుండానే పెట్రోల్ కొడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ఉదయాన్నే పెట్రోల్ పట్టుకునే వాహనాలకు పెట్రోల్ బదులకు సగం ఎయిర్, మిగిలింది పెట్రోల్ వస్తుందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చిన డబ్బులకు వచ్చిన పెట్రోల్‌కు సంబంధం లేకుండా ఉండటంతో నిలదీసిన వినియోగదారులకు పొరపాటు జరిగిందని, ఎయిర్ తీయటం మరిచిపోయామని బంకుల యజమానులు చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చీమకుర్తి పట్టణంతో పాటు మండలంలో దాదాపు 15కు పైగా పెట్రోల్ బంకులు ఉంటే వాటిలో కనీసం ఐదారు బంకుల్లో ఇలాంటి మోసాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే పెట్రోల్ ఒరిజినల్ అవునా కాదా అని తెలుసుకోవాలనే కుతూహలం ఉన్నప్పటికీ అవి అందుబాటులో లేవని, ఉన్నవి అయిపోయాయని, మళ్లీ తెప్పిస్తామనే సమాధానాలు నిర్వాహకులు, సిబ్బంది చెబుతుండడం గమనార్హం.



చీమకుర్తిలో పెట్రోల్ బంకులో నుంచి ఎయిర్ లాగుతున్న సిబ్బంది

కనిపించని బాట్లింగ్ పేపరు



మద్దిపాడు: మద్దిపాడు మండల పరిధిలోని పెట్రోలు బంక్‌ల్లో ఆయిల్ కరెక్ట్‌గానే పోస్తున్నారు కానీ వినియోగదారులు అడిగిన క్రమంలో బ్లాటింగ్ పేపర్‌ను పెట్రోల్ బంక్ యాజమాన్యం ఇవ్వాల్సి ఉంది. కానీ ఏ పెట్రోలు బంక్‌లో కూడా బ్లాటింగ్ పేపర్ అందుబాటులో లేదు. నిబంధనల ప్రకారం కచ్చితంగా వినియోగదారుడు అడిగితే బ్లాటింగ్ పేపర్‌పై పెట్రోలు వేసి చూపాల్సిన బాధ్యత బంక్ యాజమాన్యానికి ఉంది.

రీడింగ్‌లోనూ మోసాలు

కనిగిరి: కనిగిరి పట్టణంలోని ఆర్టీసీ పెట్రోల్ బంకు, డిపో కింద ఉన్న పెట్రోల్ బంకుల వద్ద ఆయిల్ కొట్టేటప్పుడు రీడింగ్ 1 నుంచి కాకుండా 5, 6 పాయింట్ల నుంచి ప్రారంభమవుతోంది. ఈ విషయాన్ని అడిగితే ఎయిర్ ఫాస్ట్‌గా వెళ్లడం వల్ల పాయింట్ల నంబర్లు తొందరగా పడ్డాయని గమనించలేదని బుకాయిస్తున్నారు. పట్టణంలోని 7 పెట్రోల్ బంక్‌ల్లో అదే పరిస్థితి ఉన్నట్లు వినియోగదారులు తెలిపారు. పెట్రోల్ బంకులో వినియోగదారునికి బిల్లులు ఇవ్వడం లేదు. పామూరులో కందుకూరు రోడ్డులోని ఎస్సార్ పెట్రోల్ బంక్‌లో నిబంధనలు పాటించడం లేదు. పామూరులో ఎక్కడా ఫైర్ సేఫ్టీ బక్కెట్లు, ఇసుక వంటి వస్తువులు లేవు. పీసీపల్లి మండలంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్‌లో ఆయిల్ కొట్టించుకుంటే వాహనాలు నిలిచిపోతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

పొగాకు రైతుల దోపిడీకి కుట్ర

- వ్యాపారుల సిండికేట్‌కు కుయుక్తులు
- కర్నాటక మార్కెట్లో కేజీ రూ.360
- జిల్లాలో కేజీ రూ.280కే కొనుగోలు అన్యాయం
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉంటుంది
- పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: పొగాకు రైతులను వ్యాపారులు దోపిడీ చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరు రవిబాబు ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నాటక రాష్ట్రం మైసూరులో నేడు కేజీ పొగాకు రూ.360లకు కొనుగోలు చేస్తుంటే జిల్లాలో మాత్రం రూ.280 కి కొనుగోలు చేయడం దారుణమన్నారు. గత ఏడాది వచ్చిన ధరల ఆధారంగా ఈ సారి రైతులు ఖర్చులు ఎక్కువైనా పొగాకు సాగు చేశారన్నారు. కూలీ, కౌలు, బ్యారన్ రేట్లు భారీగా పెరిగాయని చెప్పారు. అయినా గత సంవత్సరం వచ్చిన సరాసరికి తగ్గించి కొనుగోలు చేయాలన్న కుట్ర జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పొగాకు సాగు ఎక్కువైనందున ధరలు రావన్న ప్రచారం సాగుతోందని, దీనిని రైతులు నమ్మవద్దని ఆయన కోరారు. పొగాకు కొనుగోలు సీజన్ ప్రారంభంలోనే దోపిడీ మొదలైందని ఆయన ఆరోపించారు. అంతర్జాతీయంగా పొగాకుకు మంచి డిమాండ్ ఉంది కనుకనే మైసూరులో అత్యధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారన్న విషయాన్ని జిల్లా రైతులు గుర్తుంచుకోవాలన్నారు.

రైతుల పక్షాన వైఎస్సార్ సీపీ:

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రైతుల పక్షాన నిలుస్తోందన్నారు. గతంలో పొగాకు రైతులు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో రైతుల నష్టపోకుండా ఉండేందుకు అప్పుడు సీఎంగా ఉన్న జగన్ మోహన్‌రెడ్డి రూ.200 కోట్లు కేటాయించి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి అండగా నిలిచారన్నారు. ఫలితంగా ధరలు పుంజుకున్నాయని చెప్పారు. మార్క్‌ఫెడ్ కూడా లాభపడిందన్నారు.

సిండికేట్ అయి దగా..

సిగరెట్ తయారీదారులు వ్యాపారస్తులను సిండికేట్‌గా చేసుకుని రైతులను దగా చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. ఇప్పుడున్న ధరలకు మరో రూ.10 నుంచి రూ.20 వరకూ తగ్గించి కొనుగోలు చేయాలన్న కుట్ర కూడా జరుగుతోందన్నారు. రూ.270 సరాసరి వస్తేనే అసలు దక్కుతుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కర్నాటకలో కొనుగోళ్లు పూర్తి కాలేదని, బయ్యర్లు అందరూ అక్కడే ఉన్నారని, వారు వచ్చే వరకూ రైతులు వేచి చూడాలని సూచించారు. రూ.300పైన అయితేనే అమ్ముకోవాలన్నారు. ప్రభుత్వం కూడా రైతులను వంచిస్తే ఊరుకోమని, మా పార్టీ, మా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఎప్పుడూ అండగా ఉంటారన్నారు. మా పార్టీ ఎంపీలు రైతు సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇదే విషయాన్ని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి రైతులకు తెలిపి అండగా నిలవాలని సూచించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మిరప, కంది, పత్తి రైతులు అన్ని రకాలుగా నష్టపోతున్నారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు ఆత్మహత్యలే శరణ్యంగా ప్రస్తుత పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఒక వైపు సంక్షోభ పరిస్థితులు కొనసాగుతుంటే మరో పక్క పొగాకు మార్కెట్‌లో ధరలు దిగజారిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోవద్దని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఉంటుందని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం కానీ, పంటలు కొనేనాథుడే కరువయ్యారని విమర్శించారు. సమావేశంలో ఒంగోలు, నాగులుప్పలపాడు, సంతనూతలపాడు మండల పార్టీల అధ్యక్షులు మన్నే శ్రీనివాసులు, శ్రీమన్నారాయణ, దుంపా చెంచిరెడ్డి, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో విజిలెన్స్ దాడులు



ఒంగోలు మెడికల్ షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న అధికారులు

ఒంగోలు టౌన్: జిల్లాలో విజిలెన్స్ దాడులతో మెడికల్ షాపు యజమానులు హడలెత్తిపోయారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయించడం, నిషేధిత మందులు విక్రయించడం లాంటి ఫిర్యాదులు రావడంతో ఈగల్ టీమ్, విజిలెన్స్ అధికారులు, డ్రగ్ కంట్రోల్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఏక కాలంలో మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఒంగోలు, మార్కాపురం, కంభం, టంగుటూరు మెడికల్ షాపుల్లో 10 చోట్ల నిబంధనలు ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించారు. మందుల క్రయ విక్రయాలకు సంబంధించి రిజిస్టర్ నిర్వహించకపోవడం, వినియోగదారులకు బిల్లులు చెల్లించకపోవడం, అల్ప్రాజోలాం, కోడిన్ దగ్గు మందు, గర్భస్రావ ఔషధాలను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయించడం తదితర కారణాలపై 10 మెడికల్ షాపులకు నోటీసులు జారీ చేశారు.

ముందస్తు సమాచారంతో షాపుల మూసివేత...

అయితే విజిలెన్స్ దాడులు జరగనున్నట్లు డ్రగ్ కంట్రోల్ కార్యాలయం నుంచి మెడికల్ షాపులకు ముందస్తు సమాచారం వచ్చినట్లు తెలుస్తోంది. దాంతో నగరంతో పాటుగా జిల్లాలోని అనేక మండలాల్లో మెడికల్ షాపులను మూసివేశారు. నెలవారీ ముడుపులకు అలవాటు పడిన డ్రగ్ కంట్రోల్ కార్యాలయ సిబ్బంది నిర్వాకంతో మెడికల్ యజమానులు ముందు జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. దాంతో విజిలెన్స్ టీమ్ తనిఖీలు నామ మాత్రంగా జరిగినట్లయిందని ప్రచారం సాగుతోంది. డ్రగ్ కంట్రోల్ అధికారుల వివరణ కోసం ఎన్నిసార్లు ప్రయత్నించినా కనీసం స్పందించకపోవడంలో ఆంతర్యం ఏమిటన్నది తెలియాల్సి ఉంది.

క్రికెట్ బెట్టింగ్‌లతో జీవితాలు నాశనం

- ఎస్పీ ఏ.ఆర్ దామోదర్

ఒంగోలు సిటీ: అమాయక ప్రజలు, యువకులను లక్ష్యంగా చేసుకొని, ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చని ఆశలు రేకెత్తించేలా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తే ఊరుకునేది లేదని ఎస్పీ ఏ.ఆర్ దామోదర్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ లు జరుగనున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ నిఘా పెట్టామన్నారు. క్రికెట్ బెట్టింగ్ కు పాల్పడే కొంత మంది వ్యక్తులను గుర్తించామని చెప్పారు. క్రికెట్ బెట్టింగ్‌లతో సంబంధాలున్న పాత నేరస్తులపై కూడా బైండోవర్ కేసులు నమోదు చేశామని, యువత, విద్యార్థులు బెట్టింగ్ జోలికి వెళ్లకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ చట్టవిరుద్ధమన్నారు. వినోదం కోసం మాత్రమే క్రికెట్ మ్యాచ్ లు చూడాలని, బెట్టింగుల వైపు మొగ్గు చూపకూడదన్నారు. జిల్లాలో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిస్తే సదరు సమాచారాన్ని డయల్ 112/100 కు లేదా పోలీస్ వాట్సాప్ నంబర్ కు 9121102266 సమాచారమివ్వాలని తెలిపారు.

క్లుప్తంగా

24 నుంచి బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు డొంక వద్ద ఉన్న జిల్లా స్థాయి మహిళా ప్రాంగణంలో ఈ నెల 24వ తేదీ నుంచి మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా మేనేజర్ వై.అంజమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలల పాటు మహిళలకు ఈ శిక్షణ ఇస్తారన్నారు. 15 నుంచి 45 సంవత్సరాల్లోపు మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మేనేజర్ అంజమ్మ కోరారు. మరిన్ని వివరాలకు 8333921346 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

వరిగడ్డి దగ్ధమై రూ.2 లక్షల ఆస్తి నష్టం



వరిగడ్డిలో వస్తున్న మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

దర్శి: వరిగడ్డి వామి దగ్ధమై రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగిన సంఘటన శుక్రవారం పట్టణంలోని పుట్ట బజారులో చోటు చేసుకుంది. బాధితురాలు మస్తాన్‌బీ తెలిపిన వివరాల మేరకు గేదెలు మేపుకునేందుకు 7 ఎకరాలకు పైగా వరిగడ్డి తీసుకొచ్చి వామి వేసుకున్నారు. శుక్రవారం వరి గడ్డి వామి నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు అదుపు చేసినా వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో టపాసుల శబ్దాలు వస్తున్నాయి. నిప్పురవ్వలు పడి మంటలు చెలరేగి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మీరు రైతులు కాదోయ్.. రాయితీ రాదోయ్..!

- ఫార్మర్ రిజిస్ట్రేషన్ పేరుతో రైతులను తిప్పలు తెచ్చిన కూటమి ప్రభుత్వం
- కౌలు రైతులు, అసైన్డ్, ఆర్వోఎఫ్, ఇనామ్ భూముల రైతుల నమోదుకు కొర్రీ
- ఈ నెల 25తో ముగియనున్న రిజిస్ట్రేషన్ గడువు
- రైతు విశిష్ట గుర్తింపు కార్డు ఉంటేనే పథకాలంటున్న సర్కారు



బేస్తవారిపేట: రైతు విశిష్ట గుర్తింపు కార్డు ప్రక్రియ జిల్లాలోని రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. రైతులందరూ తప్పనిసరిగా 14 అంకెల గుర్తింపు కార్డు తీసుకోవాలంటూ వ్యవసాయశాఖ అధికారులు గత కొంత కాలంగా చెబుతూ వస్తున్నారు. ఈ క్రమంలోనే ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు గడువు విధించారు. అయితే సొంత భూములున్న రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇస్తామని పేర్కొన్న ప్రభుత్వం కౌలు రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. జిల్లాలో పీఎం కిసాన్ లబ్ధిదారులు 3,65,755 మంది కాగా పీఎం కిసాన్ పథకం నగదు జమ అవుతున్నవారి సంఖ్య 2,41,454. వీరిలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న రైతులు 2,29,565 కాగా పీఎం కిసాన్ పొందుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు 1,70,655 మంది మాత్రమే. జిల్లాలో 2024లో 33,041 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయగా ఈ ఏడాది 45 వేల మందికి కార్డులివ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. కానీ కొత్త కార్డుల జారీ ప్రక్రియలో అడుగులు ముందుకు పడలేదు.

నాటికీ.. నేటికీ ఎంత తేడా?

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో భూములున్న రైతులతో పాటు కౌలు రైతులకు ప్రభుత్వ పథకాలు అందజేశారు. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం నూతనంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని చెబుతోంది. ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో మాత్రం కౌలు రైతులకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదు. దీంతో కౌలు రైతులకు మొండిచెయ్యి చూపినట్లేనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రైతుల్లో ఆందోళన

ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుని గుర్తింపు కార్డు ఉంటేనే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణలో పరికరాలు, సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం లాంటి పథకాలు నేరుగా పొందేందుకు వీలు కలుగుతుంది. నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు లాంటి ఇతర సేవలు పొందవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నెల 25వ తేదీతో గడువు ముగియనుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కౌలు రైతులు, అసైన్‌మెంట్ భూమి, రిజర్వుడ్ ఫారెస్ట్ భూములు, ఇనామ్ భూముల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్‌లో అవకాశం కల్పించకపోవడమే రైతులు ఆందోళనకు ప్రధాన కారణం.

ఒక చోటే నమోదు..

ఆన్‌లైన్‌లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఒకచోట మాత్రమే ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఒక రైతు రెండు గ్రామ పంచాయతీల్లో గానీ, ఇతర మండలాల్లో గానీ భూములు కలిగి ఉంటే అలాంటి వారు ఒక్క చోటే నమోదు చేసుకోవాలి. గతంలో ఎన్ని చోట్ల భూములు ఉంటే అన్ని చోట్ల నమోదు చేసుకునేవారు. కానీ ఇప్పుడు ఒక చోట నమోదు చేసుకుని మరో చోటికి వెళ్తే ఇది వరకే రిజిస్ట్రేషన్ పూర్తయిందని చూపిస్తోంది.

వలస బాటలో రైతులు

అన్నదాతలకు ఖరీఫ్, రబీలో సాగు చేసిన పంటలు కలిసిరాలేదు. వాతావరణం అనుకూలించక, తెగుళ్లతో దిగుబడులు పడిపోయాయి. పెట్టుబడులు సైతం చేతికిరాక, పండిన అరకొర పంటలకు ధరల్లేక అన్నదాతలు అప్పుల్లో కూరుకుపోయారు. కుటుంబ పోషణ కోసం పిల్లాపాపలతో కలిసి చాలా మంది రైతులు ఇతర ప్రాంతాలకు వలస బాట పట్టారు.



ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

9 నెలల తర్వాత మృతదేహానికి పోస్ట్‌మార్టం

- భర్త మృతికి బంధువులే కారణమని భార్య అనుమానం
- పోలీస్, రెవెన్యూ అధికారుల సమక్షంలో శవ పరీక్ష

చీమకుర్తి: దాదాపు 9 నెలల క్రితం ఉరేసుకొని మృతి చెందిన పులివర్తి బాలసుబ్రహ్మణ్యం మృతదేహానికి శుక్రవారం రిమ్స్ ఫోరెన్సిక్ నిపుణుడు ప్రొఫెసర్ సుబ్బారావు ఆధ్వర్యంలో చీమకుర్తిలో పోస్ట్‌మార్టం నిర్వహించారు. మృతుడు బాలసుబ్రహ్మణ్యం భార్య గౌరీ పూర్ణ ఫిబ్రవరి 13వ తేదీన తన భర్త మరణంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన భర్త మరణం వెనుక మామ, మరిది ప్రమేయం ఉందని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పులివర్తి బాలసుబ్రహ్మణ్యం గత ఏడాది జూన్ 6వ తేదీన చీమకుర్తి పట్టణంలోని గాంధీనగర్‌లో ఉరేసుకొని మృతి చెందినట్లు పోలీసులు ధ్రువీకరిస్తున్నారు. అయితే తన భర్త మరణానికి కుటుంబ ఆస్తుల వివాదమే కారణమని భార్య అనుమానం వ్యక్తం చేశారు. దీంతో శ్మశానంలో పూడ్చిపెట్టిన మృతదేహానికి తహసీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, ఎస్సై కృష్ణయ్య, మృతుడి భార్య, బంధువుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్ట్‌మార్టం నివేదిక వస్తేగానీ గౌరీపూర్ణ అనుమానాలు నివృత్తి కావని పోలీసులు చెబుతున్నారు.



మృతదేహం వెలికితీతను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్, ఎస్సై, బంధువులు

బాధితులకు భరోసా ఇవ్వాలి

- ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచన
- దర్శిలో డీఎస్పీ కార్యాలయానికి స్థల పరిశీలన



ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ దామోదర్

దర్శి: సమస్యలు చెప్పుకొనేందుకు పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితులకు భరోసా కల్పించాల్సిన అవసరముందని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన దర్శితోపాటు ముండ్లమూరు, తాళ్లూరు పోలీస్‌స్టేషన్లను ఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్ల ఆవరణలో పరిశుభ్రత, గదులు, రిసెప్షన్ కౌంటర్లు, మహిళా సహాయ కేంద్రాలతో పాటు దర్శిలో డీఎస్పీ కార్యాలయం ఏర్పాటుకు గతంలో కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. శాంతి భద్రతలు కాపాడటంతోపాటు నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరాతీసి పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకుని, వేగంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. మహిళల భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, మహిళలు, పిల్లలకు సంబంధించిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. రాత్రి వేళ గస్తీని ముమ్మరం చేయాలన్నారు. చెడు నడత కలిగిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు శక్తి యాప్, సైబర్ మోసాలు, మాదక ద్రవ్యాలతో కలిగే దుష్పరిణామాలు, రోడ్డు భద్రతా నియమాలు, సీసీ కెమేరాలు, హెల్మెట్ ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం స్థానిక సువర్చలా సమేత ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఎస్పీ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎస్పీ లక్ష్మీ నారాయణ, సీఐ రామారావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు ఎస్సైలు మురళీ, నాగరాజు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్
- వైపాలెంలోని షాదీ ఖానాలో ఇఫ్తార్ విందుకు హాజరు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రాజకీయాలకు అతీతంగా ముస్లింల అభ్యున్నతికి సహకరిస్తానని యర్రగొండపాలెం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మాచర్ల రోడ్డులోని ముస్లిం షాదీ ఖానాలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. తన ప్రాణం ఉన్నంత వరకు సహాయం చేయడాన్ని ఆపేది లేదని, ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా తన కర్తవ్యాన్ని నెరవేరుస్తానని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ముస్లింలు తనకు ఎంతగానో సహకరించారని గుర్తు చేసుకున్నారు. రాజకీయాలను పక్కనపెట్టి సమస్యలు పరిష్కరించేదుకు కృషి చేస్తానని, ఆశీస్సులు అందించాలని కోరారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలో పయనిస్తూ పేదల పక్షాన పోరాడతానని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ మసీదుల ముల్లాలు, పెద్దలు హిదయతుల్లా, మొహమ్మద్, ఎస్.మజీద్, ఎం.కరీముల్లా బేగ్, సయ్యద్ జబీవుల్లా, సయ్యద్ మగ్బూల్ బాష, షేక్.ఉస్మాన్, సయ్యద్ షాబీర్‌బాష, షేక్.బుజ్జి, షేక్.కాశిం, షేక్.వలి, ఏజన్ గ్లోబల్ అధినేత మొగల్ షంషీర్‌అలిబేగ్, ఆదిత్య విద్యా సంస్థల అధినేత సూరె రమేష్, మదర్ థెరిసా విద్యా సంస్థల అధినేత బి.వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఒంగోలు మూర్తిరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, కె.ఓబులరెడ్డి, కందూరి కాశీవిశ్వనాథ్, ఒ.సుబ్బారెడ్డి, ఎస్.ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, జి.వెంకటరమణారెడ్డి, పి.కృష్ణారెడ్డి, ఎం.సుబ్బారెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఎల్లేష్ యాదవ్, చంద్రకాంత్ నాయక్, ఎ.ఆదినారాయణ, ఎం.ఆదిశేషు, సూరె శ్రీనివాస్, కె.సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆటో బోల్తాపడి మహిళా కూలీ మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతురాలు ఇండ్లా లక్ష్మమ్మ

కనిగిరిరూరల్: ఆటో బోల్తా పడి మహిళా కూలీ మృతి చెందిన ఘటన శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం పట్టణంలోని కాశిరెడ్డి కాలనీకి చెందిన కూలీలు ఆటోలో పీసీపల్లి మండలం తలకొండపాడుకు ఆటోలో వెళ్తున్నారు. మార్గం మధ్యలో మండలంలోని విజయగోపాలపురం మలుపు వద్ద చిల్లచెట్లు అడ్డు రావడంతో వాటిని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఇండ్లా లక్ష్మమ్మ (50) కిందపడటంతో తలకు బలమైన గాయమై.. తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. రావూరి సంజమ్మ, వరమ్మలకు తీవ్ర గాయాలు కావడంతో కనిగిరి వైద్యశాలకు తరలించారు. ఆటోలో ప్రయాణిస్తున్న మిగతా నలుగురు కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. ఈమేరకు ఎస్సై టీ శ్రీరాం సంఘటనా స్థలానికి వెళ్లి సందర్శించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మబాబోయ్.. ఎన్ని పాములో..



గుడ్ల నుంచి వచ్చిన పాము పిల్లలు(ఇన్‌సెట్) దాచి ఉంచిన పాము గుడ్లు(ఫైల్)

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కొండేపల్లి రోడ్డులో ఉన్న ఓ వెంచర్‌లో 15 రోజుల క్రితం 50 గుడ్లను పెట్టిన నీరుకట్టు పామును చూసిన యజమాని అటవీశాఖ స్నేక్ క్యాచర్ నిరంజన్‌కు సమాచారమిచ్చారు. అదే రోజు పట్టణ శివారులోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఓ దాల్‌మిల్‌లో మరో నీరుకట్టు పాము 50 గుడ్లు పెట్టిందని స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందింది. పాములను నీటిలో వదిలిన స్నేక్ క్యాచర్ రెండుచోట్లా సేకరించిన గుడ్లను ఇసుకలో ఉంచి నీరు పోశారు. గుడ్ల నుంచి బయటపడిన సుమారు 79 పాము పిల్లలను దోర్నాల అటవీ ప్రాంతంలో ఉన్న పెద్దచెరువు, అలాగే కంభం చెరువులో వదిలిపెట్టారు. పాములన్నీ విషపూరితం కావని, కనిపించగానే చంపవద్దని తెలిపేందుకే గుడ్లను పొదిగించినట్లు స్నేక్ క్యాచర్ పేర్కొన్నారు. నీరుకట్టు పాము ప్రమాదకరం కాదని, దాని గుడ్లపై ఈగ, దోమ వాలినా మురిగిపోయేంత సున్నితమైనవని వెల్లడించారు.

హోరాహోరీగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు



బండ లాగుతున్న ఎడ్లు

కొనకనమిట్ల: వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ఉత్సవ సేవా కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి, మేకలవారిపల్లి రెడ్ల సంఘం పర్యవేక్షణలో 18వ పర్యాయం నిర్వహించిన ఎడ్ల పోటీలను ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. ఎడ్ల పోటీలను తిలకించేందుకు రైతులు, పశుపోషకులు భారీగా హాజరయ్యారు.

హోరాహోరీగా ఎడ్ల పందేలు

ఆరు పళ్ల సైజు ఎడ్ల బండలాగుడు పోటీల్లో మొత్తం 17 జతల ఎడ్లు హోరాహోరీగా తలపడ్డాయి. ప్రకాశం, గుంటూరు, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన గిత్తలు బండ లాగుతుండగా ప్రేక్షకులు ఈలలు, చప్పట్లు, కేరింతలతో ఉత్సాహపరిచారు. వ్యాఖ్యాత, రిఫరీగా వెంకటరామిరెడ్డి, నారాయణస్వామి వ్యవహరించారు. ప్రజలకు సత్రాల్లో భోజన వసతి సమకూర్చారు.



ఎడ్ల పోటీలను తిలకిస్తున్న పశుపోషకులు



గరుడ వాహనంపై శ్రీవారు

శుక్రవారం వెలుగొండ తిరునాళ్ల కావడంతో భక్తులు పోటెత్తారు. శ్రీవారు గరుడ వాహనంపై శ్రీరామమూర్తి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని ప్రత్యేక పల్లకిపై ఊరేగించారు. భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉభయదాతలుగా కూనపల్లి శేషఫణిశర్మ, ప్రసాదశర్మ, దూర్జటిశర్మ, వీరబద్రశర్మ, శ్రీకాంతశర్మ, రామచంద్రపవన్‌కుమార్, శాంతమూర్తి, జానకీరామ్ దంపతులు వ్యవహరించారు. ఈఓ చెన్నకేశవరెడ్డి, సేవా కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం మోహినీ ఉత్సవం, గజోత్సవం, తిరునాళ్ల, పగలు ఎడ్ల పందేలు, రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

- నలుగురికి తీవ్ర గాయాలు



ఆటోలో ఉన్న క్షతగాత్రుడు

టంగుటూరు: రాంగ్ రూట్‌లో వెళ్తున్న ట్రాక్టర్ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన జాతీయ రహదారిపై టంగుటూరు టోల్ ప్లాజా సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. జరుగుమల్లి మండలం కామేపల్లికి చెందిన ఇట్టా ఆదర్శ్ కుటుంబ సభ్యులు వీరేంద్రబాబు, హాసిని, దీపిక, తన్మయి తేజ ఒంగోలు నుంచి ఆటోలో స్వగ్రామానికి వెళ్తున్నారు. టోల్ ప్లాజా సమీపంలోకి వచ్చే సరికి రాంగ్ రూట్‌లో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి ఆటో బోల్తా పడటంతో అందులో ఉన్న నలుగురికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆదర్శ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగమల్లీశ్వరరావు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



మృతుడు

సింగరాయకొండ: గుర్తు తెలియని వ్యక్తి(40) విద్యుత్ స్తంభానికి తాడుతో ఉరేసుకుని మృతి చెందిన సంఘటన శుక్రవారం పాత కలికవాయకు వెళ్లే రోడ్డులో పాల ఫ్యాక్టరీ వెనుక వైపు చోటుచేసుకుంది. ఎస్సై మహేంద్ర కథనం ప్రకారం.. మృతుడి శరీరంపై తెలుపు గడులతో కూడిన నిండుచేతుల లేత నీలం రంగు చొక్కా, నీలం రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఆచూకీ తెలిసిన వారు 9121102135, 9121102136కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ కుమారునికి కారుణ్య నియామక పత్రం



యశ్వంత్‌కు కారుణ్య నియామక పత్రం అందజేస్తున్న ఎస్పీ

ఒంగోలు సిటీ: చీరాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ 2020 సెప్టెంబర్ 9న కోవిడ్‌తో మరణించిన జేఎస్ఎస్ రత్నకుమార్ రావు కుమారుడు యశ్వంత్‌కు కారుణ్య నియామకం కింద బాపట్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పించారు. ఈ మేరకు శుక్రవారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో యశ్వంత్‌కు ఎస్పీ ఏఆర్ దామోదర్ నియామక పత్రాన్ని అందజేశారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకుని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఓ రామ్మోహన్‌రావు, డీపీఓ సిబ్బంది రవి కిరణ్ పాల్గొన్నారు.